క్లుప్తంగా

అంజన్నకు పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని గాంధ్లవీధిలో వెలసియున్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ఘనంగా పూజలు చేశారు. మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే భక్తులందరూ సహస్రనామాలతో ఆకుపూజ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు


క్రీడాకారులను సత్కరిస్తున్న హెచ్‌ఎం

రాజంపేట టౌన్ : క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆకేపాడు జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం సీవీ.రమణయ్యశెట్టి తెలిపారు. ఆ పాఠశాలకు చెందిన శ్రీనిజ అండర్–14 విభాగంలో, ఎస్.మౌలాలి అండర్–17 విభాగంలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన సందర్భంగా మంగళవారం హెచ్‌ఎం మెమెంటోలతో వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వైఎస్సార్ జిల్లా బయనపల్లెలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. తమ పాఠశాల పీడీ పెంచలమ్మ విద్యార్థులు క్రీడల్లో బాగా రాణించాలన్న లక్ష్యంతో శిక్షణ ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

పుల్లంపేట : మండలంలోని అనంతయ్యగారిపల్లిలో మంగళవారం శివారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన రమాదేవీ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 130 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొందరికి తిరుపతికి రెఫర్ చేశారు. అనంతరం కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు

ఓబులవారిపల్లె : మండలంలోని బొమ్మవరం గ్రామంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు, సర్పంచ్ లౌడి గంగరాజు వీధిలైట్లను ఏర్పాటు చేయించారు. వర్షాకాలంలో గ్రామంలో లైట్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతుండగా విషయం తెలుసుకున్న గంగరాజు పనులు చేయించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ కొండావాండ్లపల్లెకు చెందిన దేవరాజు గుండెపోటు మృతి చెందిన విషయం తెలుసుకున్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి మంగళవారం కొండావాండ్లపల్లెకు చేరుకుని వైఎస్ఆర్‌సిపినాయకులు శ్రీనివాసులరెడ్డి, వాసుదేవరెడ్డిలతో కలిసి దేవరాజు మృతదేహానికి నివాళులర్పించారు. దేవరాజు పార్టీకి చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించండి

లక్కిరెడ్డిపల్లి : గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేయాలని అంగన్‌వాడీ కేంద్ర కార్యకర్త శ్రీదేవి తెలిపారు. మంగళవారం చాకలికోటపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ ఆయాలు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు మునగాకు వల్లకలిగే లాభాలు గురించి తెలియజేయాలన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను వారికి చేరేలా చూడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ ఆయాలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సాధారణం

గాలివీడు : విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమని, ఎక్కడ పనిచేసినా గుర్తింపు తెచ్చుకునేలా బాధ్యతలు నిర్వహించాలని వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గాలివీడు–1 పంచాయతీ కార్యదర్శి బండ్ల సురేష్ కుమార్ బదిలీపై వెళుతున్న సందర్భంగా ఆయనను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట అరుంధతి కాలనీలో మాతమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. మాట్లాడుతూ ఈనెల 23, 24, 25వ తేదీలలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు జరుగుతాయన్నారు. కలశ ప్రతిష్ట, గర్భాలయంలో మాతమ్మ విగ్రహ ప్రతిష్ట కోసం పెద్దఎత్తున పూజలు, హోమాలు జరుపనున్నట్టు పేర్కొన్నారు.

నీరులేక కళావిహీనంగా పొలాలు

- ఎండిపోయిన సిద్ధవరం స్ప్రింగ్ ఛానల్
- కాలువకు నీటిని విడుదల చేయాలంటున్న రైతులు


చుక్కనీరు లేని ఊట కాలువ


నీరులేకపోవడంతో పొలాల్లో మొలిచిన పిచ్చి మొక్కలు

పెనగలూరు : మండలంలోని సిద్దవరం స్ప్రింగ్ ఛానల్ చుక్కనీరు లేకుండా ఎండిపోయింది. సిద్దవరం పంచాయతీలోని ఎగువ సిద్దవరం నడిమి సిద్దవరం, దిగువ సిద్దవరం, పద్మాయగారిపల్లె గ్రామాల్లోని భూములకు ఈ ఊటకాలువ ద్వారా నీరు సరఫరా అవుతుండేది. స్ప్రింగ్ ఛానల్ ఎండిపోవడంతో కాలువల్లో చుక్కనీరు కూడా లేకపోవడంతో పొలాలు బీడు మారాయి. ఈ స్ప్రింగ్ ఛానల్ కింద దాదాపు 200 ఎకరాలు భూమి సాగులో ఉంది. చెయ్యేరు నదిలో నీరు పారుతుంటే ఈ ఊటకాలువలో ఎప్పుడు నీరు పుష్కలంగా ఉంటాయి. సిద్దవరం ఊటకాలువ ఓబిలి దగర ఓ చెలిమి ఉంది. ఈ చెలిమిలో నుంచి నీరు వచ్చి కాలువలు ద్వారా పొలాలకు నీరు సరఫరా అవుతాయి. గతంలో మోటార్లు లేకుండా కేవలం ఈ ఊటకాలువ ద్వారానే మూడుకార్లు పంటలు పండుతుండేవి. వేసవి కాలమమైన ఏప్రిల్, మే, జూన్ మాసాలలోనూ ఈ ఊట కాలువ ఎండిపోయేది కాదు. అప్పట్లో రైతులే కాలువలు చేసుకునేవారు. ఆ తరువాత ప్రభుత్వం చైర్మన్‌ను నియమించిన తరువాత కాలువలు ఎండిపోవడం మొదలెట్టాయి. మే నెలలో ఈ ఊటకాలువలో నీరు తగ్గిపోవడంతో ఎకరాకు 44 నిమిషాలు వంతున ప్రతి రైతు ఈ వచ్చే నీటిని పంట పొలాలకు ఉపయోగించుకునేవారు. వరి పంటకు సిద్దవరం పంచాయతీలో రైతులు నీరు కట్టేవారు కాదు. పొలాలపై నీరు అడ్డం పోతూ పెనగలూరు చెరువులో పడేవి. దీంతో పెనగలూరు చెరువులో కూడా నీటిశాతం పెరిగేది. అలాంటిది నేడు ఊటకాలువ పూర్తిగా ఎండిపోయింది. ఎగువ సిద్దవరం మొదలుకొని దిగువ సిద్దవరం వరకు చాలా కాలువలు వెడల్పుగా ఉండేవి. అప్పట్లో ఎద్దుల మడక కాండ్లు సైతం ఈ కాలువ లోపలే వెళ్లేవి. అలాంటిది ఇరువైపులా కాలువలు ఆక్రమించడంతో చాలా చిన్నవిగా మారాయి. దీంతో దిగువ ప్రాంతాలకు నీరుపోవడం కూడా కష్టంగా మారింది. పది సంవత్సరాల క్రితం మండలంలో ఎక్కడా వరిపంట పండకపోయినా సిద్దవరం ఊటకాలువ కింద వరి పంట పండుతుందని రైతులకు నమ్మకం ఉండేది. వరిగడ్డి కావాలన్నా, వడ్లు కావాలన్నా సిద్దవరం వెళ్తే దొరుకుతాయనే నమ్మకం మండల ప్రజల్లో ఉండేది. అలాంటిది ప్రస్తుతం ఊట కాలువలో పశువులు తాగేందుకు నీరు లేకపోవడం గమనార్హం. ఊట నిచ్చే చెలిమి కూడా పూడిపోవడంతో కాలువలు ఎండిపోయాయి. అంతేకాక చెయ్యేరు నదిలో ఇసుకను అధికంగా ఎత్తివేయడంతో చెలిమి కంటే చెయ్యేరు నదిలో ఇసుక తక్కువ ఎత్తు ఉంటడంతో చెలిమి వేసవికాలం వస్తే ఎండిపోతుంది. నదిలో నీరు పారుతుంటే ఊటకాలువలో నీరు ప్రవహిస్తుంది లేదంటే కాలువ ఎండిపోతుంది. దీనిపై అధికారులు, పాలకులు ప్రత్యేక శ్రద్ధ చూపించి ఊటకాలువను బాగు చేసి రైతులకు నీరు వచ్చే విధంగా కృషి చేయాలని సిద్దవరం ప్రజలు, రైతులు కోరుతున్నారు.


ఎండిపోయిన ఊట కాలువ చెలిమి

మూడుకార్లు పండేవి



ఊటకాలువ ద్వారా పంచాయతీలోని మూడు గ్రామాలలో ఉన్న పొలాల్లో మూడు కార్ల పంటలు పండేవి. రెండు కార్లు వరి మధ్యలో నువ్వులు, సజ్జ, వేరుశనగ వేసేవారు. వ్యవసాయం లాభసాటిగా ఉండేది. ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయి. కాలువ పూర్తిగా ఎండిపోయింది. చుక్కనీరు కూడా లేదు. ఈ కాలువగుండా నీరు వచ్చేలా అధికారులు, ప్రభుత్వం చర్యలు చేపట్టి వ్యవసాయానికి అనుకూల పరిస్థితులు తీసుకురావాలి.

– కరణం వెంకటేష్, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు, దిగువ సిద్దవరం

కాలువలు ఆక్రమించారు



పొలాల మధ్యలో ఉన్న పెద్ద కాలువ చాలా వెడల్పుగా ఉండేది. కాలువ ఇరు పక్కల ఉన్న రైతులు ఆక్రమించడంతో ఆ కాలువ చాలా చిన్నదిగా ఉంది. అధికారులు, పాలకులు చర్యలు తీసుకొని కాలువను సర్వే చేసి వెడల్పు చేయాలి. కాలువ కింద సాగు చేసుకునే రైతుల ప్రయోజనాల దృష్ట్యా కాలువకు నీరును అందించి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

– తిప్పన జయరాం, దిగువ సిద్దవరం

చెలిమిలో పూడికతీయాలి



ఈ కాలువ కింద వందలాది రైతులు, రైతు కూలీలు ఆధారపడి జీవిస్తున్నారు. సిద్దవరం ఊటకాలువ మొదటిలో ఉన్న చెలిమిలో పూడిక తీయాలి. అలాగే కాలువలోనూ పూడిక తీసినట్లైతే నీరు పుష్కలంగా పంట పొలాలకు అందుతాయి. పంటకు నీరందక చాలా వ్యయ ప్రయాసలు పడుతున్నాం. పొలాలకు నీరు అందించి వ్యవసాయానికి అండగా నిలివాలి.

– సిద్దారెడ్డి, రైతు, నడిమి సిద్దవరం

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

సంబేపల్లె : ఆధార్ సర్వీసు కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంగళవారం ఎంపిడిఓ రామచంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23న నాగిరెడ్డిగారిపల్లె, 24న గుట్టపల్లె, 25న దేవపట్లలో ఆధార్ లింక్, మార్పులు, చేర్పులు తదితర సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

జీసీడీఓగా శశికళ



సంబేపల్లె : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న శెట్టిపల్లె శశికళ గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి(జీసీడీఓ)గా ఎంపికైనట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ మంగళవారం తెలిపారు. గత నెల దరఖాస్తు చేసుకున్న ఆమె ఈ నెల 15న ఎస్‌ఎస్‌ఏ నిర్వహించిన ఇంటర్వ్యూ హాజరై ఎంపికైనట్లు డీఈఓ శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 18వ తేదీన కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతులమీదుగా నియామకపత్రాన్ని అందుకున్నట్లు ప్రిన్సిపల్ చెప్పారు. తమ పాఠశాలలోని అధ్యాపకురాలు ఎంపికకావడం పట్ల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

సిద్దవటం : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణా, జూదం, ఎర్రచందనం, మత్తు పదార్థాలు, ఈవ్‌టీజింగ్, మట్కా వంటి అసాంఘిక కార్యాకలాపాలకు ఎవరైనా పాల్పడుతున్నట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పెన్నానదీ పరివాహక ప్రాంతాల్లో పోలీసు బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడతామని తెలియజేశారు.

సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టండి


చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ బాలకృష్ణారెడ్డి

సుండుపల్లె : మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ సమీపంలోని ప్రధాన రహదారితోపాటు పలు ప్రదేశాలలో పారిశుధ్య సమస్యలను జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. తయారైన వర్మీ కంపోస్టు ఎరువులను వినియోగదారులకు విక్రయించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. తదనంతరం యానాది కాలనీని సందర్శించారు. కాలనీ వాసులు వర్షం పడితే సీసీ రోడ్డు లేకపోవడంతో గుంతలలో వర్షపునీరు నిలబడుతుందని దారిలో నడిచేందుకు ఇబ్బంది పడుతున్నామని తెలియజేశారు. వెంటనే స్పందించిన ఆయన సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సుధాకర్ రెడ్డికి సూచించారు. అనంతరం వారు ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సురేష్ బాబు, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న తహసీల్దారు మురాషావలి

సిద్దవటం : రీసర్వేలో తలెత్తిన భూ సమస్యలపై మండలంలోని శాఖరాజుపల్లెలో గ్రామ సభను మంగళవారం నిర్వహించామని తహసీల్దారు మురాషావలి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 18 రెవెన్యూ గ్రామాల్లో నాలుగు గ్రామాలైన ఎస్.రాజంపేట, మందపల్లి, శాఖరాజుపల్లి, జంగాలపల్లె రెవెన్యూ గ్రామాల్లో గత ప్రభుత్వంలో రీ సర్వే పూర్తయ్యిందన్నారు. ఈ నాలుగు గ్రామాల్లో జరిగిన రీసర్వేలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహించాలని సూచించిందన్నారు. గ్రామ సభలో ముఖ్యంగా రైతుల నుంచి నాలుగు అంశాలపై అర్జీలు అందజేస్తే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. గ్రామ సర్వేయర్ ఇమ్మానియేల్ మాట్లాడుతూ పట్టాదారుని పేరు, జాయింట్ ఎల్‌పీఎం, ఏరియా విస్తీర్ణం, భాగ పరిష్కారాల లాంటి సమస్యలను పరిష్కారు మార్గం చూపిస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ శివశంకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్య, రైతులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన

రామాపురం : ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖ వ్యాధుల పట్ల మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జోనల్ సూపర్‌వైజర్ రమణారెడ్డి, లింక్ వర్కర్ సునీల్ మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండడంతో గురికాకుండా చూసుకోవచ్చునని, చికిత్స కంటే నివారణ మంచిదని తెలిపారు. కేవలం అరక్షిత లైంగిక సంబంధాలు, కలుషితమైన సూదులు, పరీక్షింపబడని రక్తము ద్వారా హెచ్ఐవీ ఉన్న గర్భిణీ నుంచి పుట్టబోయే బిడ్డకు సంక్రమిస్తుందని చెప్పారు. ఆసుపత్రులలో ఉచితంగా అందుబాటులో పరీక్షలు ఉన్నాయని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. సందేహాలు, అనుమానాలు ఉన్నచో ఉచిత హెల్ప్ లైన్ 1097కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చునని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్యామలాదేవి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ చిన్నరెడ్డప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలి


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వన్‌స్టాప్ సిబ్బంది తదితరులు

రాయచోటి అర్బన్ : చట్టాలపై మహిళలకు పూర్తిస్థాయి అవగాహన అవసరమని వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకురాలు టి.ప్రభావతి అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాయచోటి రూరల్ మండల పరిధిలోని గొర్లముదివీడు, మాధవరం గ్రామాలలోని మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం వన్‌స్టాప్ సెంటర్‌ను జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఏర్పాటు చేశారన్నారు. హింస, లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, వివాహేతర సంబంధాలు, బెదిరింపుల వల్ల బాధపడుతున్న మహిళలకు వన్‌స్టాప్ సెంటర్ ఉద్యోగులు తక్షణ సహాయం అందిస్తారన్నారు. తమ హక్కులను తెలుసుకుని రక్షణపొందాలని సూచించారు. సమస్యతో వచ్చే మహిళలకు తాత్కాలిక వసతి కల్పనతో పాటు కౌన్సిలింగ్ ఇవ్వడం, న్యాయ, వైద్య, పోలీసు సహకారాలు ఉచితంగా అందజేస్తారంటూ చెప్పారు. మహిళల కోసం 181 హెల్ప్‌లైన్‌ను తీసుకొచ్చినట్టు పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల నివాళి


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని మాధవరంపోడు ఎంపీటీసీ ఏడుగ మహేశ్వర్ తమ్ముడు ఏడుగ సుబ్రమణ్యం అకస్మాత్తుగా మృతి చెందడంతో తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మంగళవారం మృతుడి కుటుంబాన్ని ఓదార్చి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడు సుబ్రమణ్యం గ్రామంలో పార్టీకి అండదండలుగా ఉండేవాడని, ఆయన మృతి తీరని లోటని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సాద్దయ్య, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి

సిద్దవటం : మండల పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపం ఉంటే వంట ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ విలియంరాజు అన్నారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత లోపం లేకుండా ఉపాధ్యాయులు తనిఖీలు చేస్తుండాలన్నారు. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కమిటీ సమావేశాల్లో వారి పిల్లల ప్రోగ్రెస్ రిపోర్టును చూపించాలని ఉపాధ్యాయులకు తెలియజేశామని ఆయన అన్నారు.

అర్చకులను నియమించండి

రామాపురం : మండలంలోని రాచపల్లి పంచాయతీ పరిధిలోని వడ్డెపల్లి, గంగనేరు క్వాటర్స్‌లో నిర్మించిన శ్రీ రామాలయం, రాచపల్లి, క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి ఆలయాలకు ధూపదీపం పథకం కింద అర్చకులను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు తెలిపారు. పూర్వం నుండి ఇక్కడ ఉన్న దేవాలయాల్లో పూజలు చేస్తున్నామని, అధికారులు వెంటనే స్పందించి ఆలయాలకు అర్చకులను నియమించి స్వామివారికి ధూపదీప నైవేద్యాల సమర్పణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

ఎస్ఆర్ శంకరన్ ఆశయాలను కొనసాగిద్దాం


శంకరన్ జయంతి వేడుకల్లో పలు సంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : మాజీ ఐఏఎస్ అధికారి శంకరన్ ఆశయాలను కొనసాగిద్దామని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మండెం సుధీర్ కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో శంకరన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకరన్ బ్రాహ్మణ కులంలో పుట్టినప్పటికీ దళితులకు మద్దతుగా గట్టివాదనను వినిపించేవారన్నారు. బొగ్గు గనులను జాతీయం చేయడం, వెట్టిచాకిరీ నిర్మూలనలోనూ కీలకపాత్ర పోషించాడంటూ చెప్పారు. గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఆహార హక్కు చట్టాన్ని అమలులోకి తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఐటీడీఏల ఏర్పాటులో ప్రముఖపాత్ర పోషించాడంటూ అన్నారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌లకు ఊపిరి పోశాడన్నారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి నిరంతరం కృషిచేసిన శంకరన్‌ను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథనాయక్, ఎమ్మార్పీస్ జాతీయనేత రామాంజనేయులు, పౌరహక్కుల సంఘం నేత మోడపోతుల రవిశంకర్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, లంబాడా హక్కుల సంఘం రాష్ట్రనేత శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే బాణసంచా విక్రయాలు

రాజంపేట : నిబంధనల మేరకే బాణసంచా విక్రయాలు జరగాలని సబ్‌కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి అన్నారు. మంగళవారం సబ్‌కలెక్టరేట్‌లోని అన్నమయ్య సభా భవనంలో ఆమె దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకొని బాణసంచాల విక్రయాలు, షాపులు నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల మధ్యలో బాణసంచా దుకాణాలు ఉండరాదన్నారు. ఆ విధంగా ఉంటే వెంటనే సీజ్ చేయాలన్నారు. బాణసంచా అక్రమ నిల్వలను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అగ్నిప్రమాదాలు సంభవించుకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. బాణసంచాలను అధిక ధరకు విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఊరికి దూరంగా బాణసంచా షాపులను ఉండాలన్నారు. లైసెన్స్‌కు సంబంధించిన మార్గదర్శకాలు తప్పనసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ యల్లమరాజు, మున్సిపల్ కమిషనరు బిల్లా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడి సాధించడమే లక్ష్యం


గాలివీడు: రైతులకు సూచనలిస్తున్న ఏఓ మురళీధర్


సిద్దవటం: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్ జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

గాలివీడు : వ్యవసాయంలో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి మురళీధర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గోపనపల్లె, అరవీడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ శాఖలైన ఉద్యాన, పట్టు, పరిశ్రమ, సేంద్రియ శాఖల అధికారుల సమన్వయంతో ఆధునిక పద్ధతులపై దృష్టి సారించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అలానే అన్నదాతలను కలిసి సాగు కష్టాలు తెలుసుకుని నూతన దిగుబడులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఖరీఫ్, రబీ సాగుల్లో నాలుగు నెలల వంతున పొలం పిలుస్తోంది పంట దిగుబడి తగ్గడానికి కారణాలు తెలుసుకుని సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి భూసారం పెంచేలా సూచనలు చేసి తుంపర, బిందు సేద్యం పథకం దిశగా ప్రోత్సహిస్తున్నామన్నారు.

ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని కేసీ అగ్రహారం, బయనపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులకు ఏఓ సుధాకర్, హెచ్ఓ భాస్కర్‌లు అరటి, బొప్పాయి, మామిడి తదితర పంటలలో అధిక దిగుబడులు తేవడానికి ఎరువుల వాడకంపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ అధిక దిగుబడి రావాలంటే ఎరువుల వాడకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి నిత్యం అందుబాటులో ఉండే వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకొని భూసారాన్ని బట్టి ఎరువులను వాడుకోవాలన్నారు. సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నేకనాపురంలో పొలం పిలుస్తోంది

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లె రైతు సేవా కేంద్రం పరిదిలోని నేకనాపురం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించామని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు గ్రామంలోని ప్రభాకర్, తిప్పారెడ్డిగారి సుబ్బారెడ్డి అనే రైతుల వరి పంట పొలాలను పరిశీలించారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ వరిలో తెల్లతెగులు, పాము పొడ తెగులును గమనించామన్నారు. తెల్ల తెగులు నివారణకు క్లోరోఫైరీఫాస్ అనే మందును ఒక లీటరు నీటికి 2 ఎంఎల్ చొప్పున, పాము పొడ తెగులు నివారణకు వాలిడామైసిన్ అనే మందును ఒక లీటరు నీటికి 2 ఎంఎల్ చొప్పున మందును కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించామన్నారు. అంతేగాకుండా ప్రతి రైతు పొలాలను ఖాళీగా ఉంచుకోకుండా ఏందో ఒక పంటను సాగుచేయాలని తెలియజేశామన్నారు. ప్రతి రైతు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ట్రైకో డెర్మా, సూడోమోనాస్ వాడకం, ప్రకృతి వ్యవసాయ విధానలపై రైతులతో చర్చించి సందేహాలను నివృత్తి చేయడం జరిగిందన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్తు బుగ్గి

రాజంపేట టౌన్ : మాదకద్రవ్యాలకు బానిసలైతే భవిష్యత్తు బుగ్గి అవుతుందని రాజంపేట ఏరియా ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల వల్ల ఆరోగ్యం దెబ్బతినడమే కాక సమాజంలో గౌరవ మర్యాదలు ఉండవని చెప్పారు. డ్రగ్స్‌రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని తెలియజేశారు. కార్యక్రమంలో నవజీవన్ సేవా ఆశ్రమ సంఘ్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ రాజశేఖర్, ఏఎన్ఎం సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి అమానుషం

ఓబులవారిపల్లె : పెద్దఓరంపాడు పెరుమాళ్లపల్లి దళితవాడ గ్రామస్తులపై అగ్రవర్ణాల దాడి అమానుషమని సీపీఐ రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ జ్యోతి చిన్నయ్య అన్నారు. మంగళవారం దాడిలో గాయపడ్డ వారిని సీపీఐ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా జ్యోతి చిన్నయ్య మాట్లాడుతూ వందల ఎకరాలు భూములు ఉన్న అగ్రవర్ణాల వారు దళితులకు చెందిన రెండు ఎకరాల భూములను ఆక్రమణలకు పాల్పడుతున్నారని, దళితవాడ గ్రామస్తులకు కేటాయించాల్సిన భూములను ఆక్రమణ అడ్డుకున్నందుకు పథకం ప్రకారం కర్రలతో దాడి చేయడం దారుణమని విమర్శించారు. రాష్ట్రంలో దళితులకు రక్షణలేకుండా పోయిందని, మహిళలు అని కూడ చూడకుండా దాడులకు దిగడం దుర్మార్గపు చర్య అని అభివర్ణించారు. దళితులకు అండగా ఉంటామని, న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.